నవతెలంగాణ

ఆదిలాబాద్

శనివారం | మార్చి 23, 2024 | www.navatelangana.com

పౌష్టికాహారం తీసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూపర్వైజర్లు ఉమా, ప్రదీపిక అన్నారు. శుక్రవారం గాదిగూడ మండల కేంద్రంలో పోషణ పక్షోత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్లు గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. మూడు నుండి ఆరు సంవత్సరాల చిన్నారులకు ప్రీ స్కూల్ ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణులు చిరుధాన్యాల వాడకంతో రక్తహీనత నుండి బయటపడొచ్చని తెలిపారు. ఎక్కువ పోషక ఆహారాన్ని తీసుకోవాలన్నారు. పిల్లల ఎదుగుదలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ముందుగా గర్భిణులకు సీమంతం నిర్వహించి పండ్లు పంపిణీ చేశారు.



ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-బేల

మండలంలోని సాంగిడి గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే పాయల్ శంకర్ హనుమాన్ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించారు. గ్రామాభివృద్ధిలో భాగంగా గ్రామస్తుల సహకారంతో ఫంక్షన్ హాల్ నిర్మించారు. దీన్ని చుట్టు పక్కల గ్రామస్తులు శుభ కార్యాలకు ఉపయోగించుకోవచ్చని వీడీసీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా దాతలు పెంటన్న, మంచాల భూపతిరెడ్డి, డాక్టర్ అమృత్‌రెడ్డి, కన్నాల గంగన్న, బాల్‌చందర్, దయాకర్‌రెడ్డి, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పార్టీల నాయకులు, సాంగిడి గ్రామస్తులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌కు పలువురు ప్రజాప్రతినిధులు రాజీనామా



నవతెలంగాణ-నిర్మల్

బీఆర్ఎస్‌కు జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు శుక్రవారం రాజీనామా చేశారు. నిర్మల్ మండల పరిషత్ అధ్యక్షులు కోరిపల్లి రామేశ్వర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎర్రటంతు రాజేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసినట్లు వెల్లడించారు.

ఏప్రిల్ 14 వరకు ఓటరు నమోదుకు అవకాశం

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నూతన ఓటర్లుగా నమోదుకు వచ్చేనెల ఏప్రిల్ 14వ తేదీ వరకు అవకాశం ఉన్నందున జిల్లాలోని 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మే 13వ తేదీన జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా, నిజాయితీగా, నిర్భయంగా ఓటు వేయాలని, పోలింగ్ శాతన్ని పెంచాలని పేర్కొన్నారు. ఓటరు జాబితాలో ఓటు ఉన్నది లేనిది పరిశీలించుకొని, లేని పక్షంలో ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. యాప్ ద్వారా గాని, ఫారం-6 ద్వారా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వారు, ఇప్పటి వరకు ఓటరుగా నమోదు చేసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



నవతెలంగాణ-బోథ్

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కౌఠ(బి) గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం కనుగుట్ట గ్రామంలో శబరి మాత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. శబరి మాత ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, జెడ్పిటిసి సంధ్యారాణి, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, ఎలక రాజు, వెండి సోమేశ్, స్వామి పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-బోథ్

విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని నెహ్రూ యువ కేంద్ర జిల్లా కో ఆర్డినేటర్ వెండి సోమేశ్వర్ అన్నారు. మండలంలోని కౌఠ(బి) పాఠశాలలో నారీశక్తి కార్యక్రమంలో భాగంగా ఆటలపోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శశిధర్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఐదో తరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు



నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల గ్రామంలోని శుక్రవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలు, పాటలతో అలరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్లకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024-25 సంవత్సరానికిగాను 6,7,8,9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సువర్ణలత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 23 వరకు దరఖాస్తుకు గడువు ఉందని తెలిపారు.

అయోమయంలో ఆ రెండు పార్టీలు..!

- ఎన్నికలకు ముందు, ప్రస్తుతం పరిస్థితి తారుమారు
- దిక్కుతోచని స్థితిలో ఆ పార్టీల నాయకులు, కార్యకర్తలు

ఎన్నికలకు ముందు వరకు ఆ రెండు పార్టీలు బలంగానే ఉన్నాయి. గడిచిన అసెంబ్లీ ఎన్నికలలో ఈ పార్టీలు విజయం సాధించే స్థాయిలో కేడర్‌ను కలిగి ఉన్నాయి. కాని ఎన్నికల తర్వాత పరిస్థితి మారింది. ఇపుడు కనీసం ఆ పార్టీల దిక్కు చూసే వారే కరువయ్యారు. ఇప్పుడు కొంతమంది ఆ పార్టీలలో ఉన్నా వారు కూడా ఇతర పార్టీల వైపు చూస్తున్నారు. ఇదీ సిర్పూరు నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీఎస్పీల పరిస్థితి.

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికలలో ప్రధానంగా మూడు పార్టీల మధ్య పోరు జరిగింది. బీజేపీ, బీఆర్ఎస్, బీఎస్పీలు పోటాపోటీగా ప్రచారం నిర్వహించి పోటీలో నిలిచారు. బీజేపీ నుండి డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, బీఆర్ఎస్ నుండి కోనేరు కోనప్ప, బీఎస్పీ నుండి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌లు పోటీలో ఉండగా, కాంగ్రెస్ నుండి రావి శ్రీనివాస్ పోటీ చేశారు. నాలుగు పార్టీలు పోటీలో ఉన్నా ప్రధానంగా బీజేపీ, బీఆర్ఎస్, బీఎస్పీల మధ్యే పోటీ కొనసాగింది. కాంగ్రెస్ నామమాత్ర పాత్రనే పోషించింది. చివరికి బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీష్ బాబు గెలుపొందినా, బీఆర్ఎస్, బీఎస్పీలు గట్టి పోటీ ఇచ్చాయి. ఇది అసెంబ్లీ ఎన్నికల నాటి పరిస్థితి. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఇక్కడ రాజకీయ ముఖచిత్రమే మారిపోయింది. ఎన్నికలలో రెండో స్థానంలో నిలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప కాంగ్రెస్‌లో చేరారు. దీనితో బీఆర్ఎస్ నాయకత్వమంతా ఆయనతో పాటే కాంగ్రెస్‌లోకి వెళ్లిపోయింది. ఇపుడు బీఆర్ఎస్‌కు నియోజకవర్గంలో చెప్పుకోతగ్గ కేడర్ లేదు. ఇక బీఎస్పీ నుండి పోటీ చేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇటీవల మాజీ సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరడం ఇక్కడి బీఎస్పీ నేతలను అసంతృప్తికి గురి చేసింది. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఎస్పీలో చేరక ముందు నియోజకవర్గంలో బీఎస్పీ బలం అంతంతమాత్రమే. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రాకతో బీఎస్పీ బలోపేతమైంది. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ స్థానికంగా ఉంటూ నాయకులకు, కార్యకర్తలకు అండగా నిలువడంతో పార్టీ బలం పెరిగింది. ఇపుడు ఆయన తీసుకున్న నిర్ణయం (బీఆర్ఎస్‌లో చేరడం) స్థానిక బీఎస్పీ నేతలను అయోమయంలో పడేసింది.

బీఆర్ఎస్‌కు ఎమ్మెల్సీనే పెద్ద దిక్కు

కాగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దండె విఠల్ కాగజ్‌నగర్‌కు చెందిన వాడు కావడంతో ఇపుడు ఆయనే నియోజకవర్గానికి పెద్ద దిక్కుగా మారాడు. కోనేరు కోనప్ప ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎమ్మెల్సీ దండె విఠల్ తరచుగా నియోజకవర్గంలో పర్యటించాడు. కాని తనకంటూ ఒక కేడర్‌ను ఏర్పాటు చేసుకోలేదు. అప్పటి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పైనే పార్టీ ఆధారపడడం తప్ప, ఎమ్మెల్సీ దండె విఠల్ పార్టీ బలోపేతం దిశగా ఆలోచన చేయకపోవడం ఇపుడు పార్టీకి తీవ్ర నష్టంగా మారింది. అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి హరీష్‌బాబుకు 63వేల పై చిలుకు ఓట్లు రాగా, రెండో స్థానంలో ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్పకు 60వేల పైచిలుకు ఓట్లు వచ్చాయి. బీజేపీకి గట్టి పోటీ ఇచ్చిన బీఆర్ఎస్ నేడు దిక్కుతోచని పరిస్థితిలో ఉంది. ఇక బీఎస్పీ విషయానికి వస్తే అసెంబ్లీ ఎన్నికలలో ఆ పార్టీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ 44 వేల పైచిలుకు ఓట్లు సాధించారు. ఇపుడు ఆ పార్టీకి నాయకత్వమే కరువైంది. ఆ పార్టీలో ఉన్న వారంతా తలో దిక్కు పయనమవుతున్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి అర్షద్ హుస్సేన్ ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరగా, రాష్ట్ర కార్యదర్శి, మాజీ జెడ్పీ చైర్మన్ సిడం గణపతి ఇటీవలే ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నిర్ణయాన్ని తప్పు పడుతూ తన రాజకీయ భవిష్యత్తు గురించి త్వరలోనే ప్రకటిస్తానని చెప్పారు. దీనితో ఆ పార్టీ ప్రభావం నియోజకవర్గంలో శూన్యంగా మారింది.

బలోపేతమైన కాంగ్రెస్

గత ఎన్నికలలో కేవలం 8 వేల పైచిలుకు ఓట్లు సాధించిన కాంగ్రెస్, కోనప్ప చేరికతో బలంగా మారింది. కాని రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న కోనప్ప, అతని మేనల్లుడు రావి శ్రీనివాస్‌లు ఒకే గూటికి చేరి రాజకీయం చేస్తున్నారు. రాజకీయంలో అపార అనుభవం కలిగిన కోనేరు కోనప్పకు తాను అన్ని విధాలా సహకారం అందిస్తానని ఇప్పటికే రావి శ్రీనివాస్ ప్రకటించడం కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఏది ఏమైనా అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీకి ధీటుగా ఓట్లు రాబట్టుకున్న బీఆర్ఎస్, బీఎస్పీలు ఇపుడు నామమాత్రంగా మారగా, నామమాత్రపు ఓట్లు తెచ్చుకున్న కాంగ్రెస్ నియోజకవర్గంలో బలోపేతం కావడం ఇక్కడ గమనార్హం.



కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాకా వారసునిగా వంశీకృష్ణ రాజకీయ అరంగేట్రం

- కాంగ్రెస్ నుండి పెద్దపల్లి ఎంపీగా పోటీ
- ఆశావాహులకు ఆశాభంగం

నవతెలంగాణ-జైపూర్

అందరూ ముద్దుగా పిలుచుకునే కాకా గడ్డం వెంకటస్వామి వారసునిగా ఆయన మనువడు గడ్డం వంశీకృష్ణ రాజకీయ అరంగేట్రం చేస్తున్నాడు. కాకా అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటే కాకా అనిపించుకున్న వెంకటస్వామి వారసునిగా ఆయన ప్రాతినిధ్యం వహించిన పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుండే మనువడు పోటీకి దిగడం గమనార్హం. గురువారం కాంగ్రెస్ అధిష్టానం గడ్డం వంశీకృష్ణ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఆశావాహులకు మాత్రం నిరాశ తప్పలేదు. టికెట్ ఆశిస్తూ దరఖాస్తు చేసుకున్న వారంతా చివరి వరకు ప్రయత్నాలు చేశారు. పెద్దపల్లి ఎంపీగా బీఆర్ఎస్ నుండి పోటీ చేసి గెలిచిన సిట్టింగ్ వెంకటేశ్ నేత ఇటీవల కాంగ్రెస్‌లో చేరి టికెట్ ఆశించిన వారిలో ఉన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ నుండి పెద్దపెల్లి ఎంపీగా గెలుపొందిన సుగుణకుమారి ప్రస్తుతం కాంగ్రెస్ నుండి తిరిగి పోటీ చేయడానికి ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయాలని భావించి అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్న రామిళ్ల రాధిక కూడా పెద్దపల్లి ఎంపీ టికెట్ ఆశించారు. గడ్డం వివేక్ అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీ నుండి కాంగ్రెస్‌లో చేరి చెన్నూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందాడు. కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డ డాక్టర్ రాజారమేష్ బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. రామిళ్ల రాధిక మాత్రం కాంగ్రెస్ నాయకురాలిగానే కొనసాగుతున్నారు. వీరితో పాటు పెర్క శ్యామ్, ప్రస్తుతం పెద్దపల్లి నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న గోమాస శ్రీనివాస్ గతంలో కాంగ్రెస్ నాయకునిగా చెన్నూర్ అసెంబ్లీ టికెట్ ఆశించి విఫలమయ్యారు. అనంతరం పెద్దపల్లి పార్లమెంట్ టికెట్ లభిస్తుందని కొంత కాలం వేచి చూసిన ఆయన మారుతున్న రాజకీయ సమీకరణాలతో కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరి ఆ పార్టీ టికెట్ పొందాడు. కాంగ్రెస్ టికెట్ ఆశించిన వారిలో పెర్క శ్యామ్ కూడా ఉన్నారు. టీపీసీసీ సభ్యునిగా కొనసాగుతున్న తనకు పెద్దపల్లి పార్లమెంట్ టికెట్ వస్తుందనే నమ్మకంతో ఉన్నాడు. అధిష్టానం మాత్రం కాకా మనువడు గడ్డం వంశీకృష్ణ వైపే మొగ్గు చూపింది.


పెద్దపల్లి బరిలో ఇద్దరు కొత్తవారే..

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుండి పోటీ పడుతున్న ప్రధాన పార్టీలకు చెందిన ముగ్గురు అభ్యర్థుల్లో ఇద్దరు అభ్యర్థులు కొత్తవారే. కాంగ్రెస్ నుండి పోటీ పడుతున్న గడ్డం వంశీ కృష్ణ మొదటిసారి ఎన్నికల బరిలో దిగుతున్నాడు. తాతా వెంకటస్వామి రాజకీయాల్లో కాకలు తీరిన యోధుడు కాగా పెద్ద తండ్రి గడ్డం వినోద్ గతంలో చెన్నూర్ ఎమ్మెల్యేగా గెలుపొంది క్యాబినెట్ మినిస్టర్‌గా పని చేశారు. తండ్రి గడ్డం వివేక్ గతంలో పెద్దపల్లి ఎంపీగా ప్రాతినిధ్యం వహించాడు. ప్రస్తుతం చెన్నూర్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బీజేపీ నుండి పోటీ పడుతున్న గోమాస శ్రీనివాస్ రాజకీయ నాయకునిగా చెన్నూర్ నియోజకవర్గ ప్రజలకు సుపరిచితుడే. మొదటిసారి ఎన్నికల బరిలోకి దిగుతున్నాడు. బీఆర్ఎస్ అభ్యర్థిగా కొప్పుల ఈశ్వర్ పోటీ పడుతున్నాడు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులతో పోల్చి చూస్తే బీఆర్ఎస్ అభ్యర్థికి రాజకీయ అనుభవం ఉంది. పెద్దపల్లి నియోజకవర్గ ఓటర్లు ఎవరికి పట్టం కడతారో మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.



ప్రజలు ధైర్యంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- మంచిర్యాల ఏసీపీ ప్రకాష్



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-నస్పూర్

ప్రజలు ధైర్యంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని మంచిర్యాల ఏసిపి ప్రకాష్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సిసిసి నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనల జరగకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా, ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. వారిలో నమ్మకం, భరోసా, భద్రత కలిగేలా సిసిసి నస్పూర్‌లో జిటి హాస్టల్ నుండి షిర్కే, రాయల్ టాకీస్ చౌరస్తా, సిసి కార్నర్ మీదుగా తెలంగాణ చౌరస్తా వరకు పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాల పై ప్రత్యేక దృష్టి సారించి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించడం జరుగుతుందని, ఎవరైన అల్లర్లు సృష్టించాలని చూస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల లో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా పారదర్శకంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల సిఆర్‌పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఏకే పాండే, మంచిర్యాల రూరల్ సిఐ అశోక్, నస్పూర్ ఎస్‌ఐలు రవికుమార్, జితేందర్, హాజీపూర్ ఎస్ఐ సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నెలాఖరులోపు వంద శాతం పన్ను వసూలు చేయాలి

- నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



నవతెలంగాణ-నిర్మల్

ఈ నెలాఖరులోపు వంద శాతం పన్ను వసూలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మార్చి 31 లోపు వందశాతం పన్ను వసూలుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇప్పటివరకు జిల్లాలో 83 శాతం పన్ను వసూలు చేయడం జరిగిందని, మిగిలిన పన్ను వసూలును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు ఉదయం 8గంటల లోపు గ్రామాల్లో పన్నుల వసూలు ప్రారంభించాలని ఆదేశించారు. ప్రత్యేక అధికారులు గ్రామపంచాయతీలను సందర్శించాలని, ఎండల తీవ్రత కారణంగా గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎండాకాలం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గ్రామాల్లో పనిచేయకుండా ఉన్న బోర్‌వెల్స్, చేతిపంపులకు మరమ్మత్తులు చేపట్టాలన్నారు. ఎండలు అధికంగా ఉన్నందున జనాల రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాలలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాలలో కూలీలకు ఎండల తీవ్రత నుంచి రక్షణ, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. రాబోయే రెండు నెలలు ఎండలు అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గ్రామాల్లో చెత్తను రోడ్లపై వేయకుండా నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, నర్సరీలలో గ్రీన్ షెడ్ నెట్స్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. ఎన్నికల కోడ్ కచ్చితంగా అమలు చేయాలని, రాజకీయ పార్టీల ప్రచారాలకు సంబంధించిన పోస్టర్లను, ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అనంతరం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా పోస్టర్‌లను కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ డిఈ సందీప్, తహసీల్దార్లు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్‌ల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-నిర్మల్

చెక్‌పోస్ట్‌ల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. లోక్‌సభ సాధారణ ఎన్నికల సందర్భంగా సారంగాపూర్ మండలం చించోలి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పటిష్ట నిఘా చర్యలు చేపట్టి విస్తృత తనిఖీలు నిర్వహించాలని, నగదు, మద్యం రవాణాను నియంత్రించాలని అన్నారు. పోలీసు సిబ్బంది విధుల నిర్వహణ, వాహనాల తనిఖీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాల తనిఖీకి సంబంధించిన రిజిస్టర్లను నిర్వహించాలన్నారు. ప్రతి చెక్‌పోస్ట్‌లో వీడియోగ్రఫీ చేయాలన్నారు. అప్రమత్తంగా ఉంటూ, 24గంటల పటిష్ట నిఘా పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ రత్నకల్యాణి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

2
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శనివారం | మార్చి 23, 2024 | www.navatelangana.com

ఉచిత గాలికుంటు నివారణ టీకాలు

నవతెలంగాణ-ఇచ్చోడ

వేసవిలో పశువులకు చర్మ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఉచిత గాలికుంటు నివారణ టీకాలను ఆవులకు, గేదెలకు, ఎద్దులకు వేయడం జరుగుతుందని మండల పశు వైద్య అధికారి డాక్టర్ గోవింద్ నాయక్ అన్నారు. శుక్రవారం ఇచ్చోడ మండలంలోని గుబ్బా గ్రామంలో ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 120ఆవులకు, 200 గేదెలకు, 150ఎద్దులకు టీకాలు వేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శేఖర్, దేవురావు, పశువుల యజమానులు పాల్గొన్నారు.



గర్భిణులకు ఉచిత వైద్యపరీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

గర్భిణులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించామని పీహెచ్‌సీ డాక్టర్ సర్వరాజ్ తెలిపారు. శుక్రవారం మావల మండలంలోని రాంనగర్, వాఘాపూర్, దస్నాపూర్‌కు చెందిన 37 మంది గర్భిణులకు, రక్త పరీక్షలు, బీపీ వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశామని అన్నారు. ఈ శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పీలు సౌజన్య, పూనం, శిరీష, రోజా రమణి, ల్యాబ్ టెక్నీషియన్ మడావి శ్రీనివాస్, ఆరోగ్య సహాయకులు ఇర్ఫానా, ప్రేమ్‌సింగ్, సాజిధ, శకుంతల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మున్సిపల్ యూనియన్ సమావేశంలో జిల్లా నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) సమావేశాన్ని శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగం రాజమల్లు, ఆదిలాబాద్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అగ్గిమల్ల స్వామి, జిల్లా అధ్యక్షులు దర్శనాల నాగేష్, డ్రైవర్ విభాగం అధ్యక్షుడు మెరుగు జనార్దన్, ఉపాధ్యక్షులు ఎండీ అజీమ్, లేబర్ల విభాగం అధ్యక్షుడు బొజ్జ ఉశన్న పాల్గొన్నారు. ఈ సమావేశంలో కార్మికుల కుటుంబాల బాగుకోసం రాష్ట్ర నాయకులు సమావేశంలో పలు సూచనలు చేశారు. తమకు రావాల్సిన పీఎఫ్, ఈపీఎఫ్, డబ్బులను తప్పకుండా సాధించుకుందామని అన్నారు. ఆదిలాబాద్‌లో నెలకొన్న సమస్యలని పరిష్కరిస్తామని రాష్ట్ర నాయకులు హామీ ఇచ్చారు. అవసరమైతే ఆదిలాబాద్‌లో ప్రత్యక్ష పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్మికులకు ఎల్లవేళలా సీఐటీయూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

వైద్యవృత్తిలో ఓపిక చాలా అవసరం : డీఎంహెచ్ఓ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వైద్యవృత్తిలో ఓపిక చాలా అవసరమని డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. నూతనంగా నియమితులైన ఎంఎల్‌హెచ్‌పీలకు శుక్రవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో వారి విధులను తెలియజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ పాల్గొని ఏ విధంగా ఏ విధులు నిర్వహించాలో వివరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ వైద్య వృత్తిలో ఓపిక చాలా ఉండాలని, బాధలతో వచ్చే రోగులకు ధైర్యం చెప్పాలన్నారు. నూతనంగా నియమితులైన ఎంఎల్‌హెచ్‌పీలకు వారికి కేటాయించిన గ్రామాల్లో పెద్దలతో సమావేశం నిర్వహించి, వారి సేవలను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. చేసే పనితో పాటు వాటి రికార్డులను నమోదు చేయాలని సూచించారు. సందర్శన సమయంలో అధికారులు రికార్డులే చూస్తారని తెలిపారు. వాటిని సక్రమంగా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన, ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం అధికారి అనిల్ పాల్గొన్నారు.

కొలాం, గోండు పిల్లలకు ఉపయోగపడుతుంది

నవతెలంగాణ-ఉట్నూర్

కొలాం, గోండు పిల్లలకు ఈ అనువాదం చేస్తున్న పుస్తకాలు చాలా ఉపయోగపడుతుందని ఐటీడీఏ పీఓ కుష్బు గుప్తా అన్నారు. బాల సాహిత్యం, తెలుగు భాష నుంచి గోండు, కొలామి భాషలోకి అనువాదం చేసే కార్యాశాలను శుక్రవారం మండలంలోని కేబి కాంప్లెక్స్ పీఎమ్మార్సీలో మూడు రోజుల పాటు జరుగుతున్న కార్యశాలను ప్రాజెక్ట్ అధికారి కుష్బు గుప్తా సందర్శించారు. పిల్లల కోసం మాతృభాషలో అనువాదం చేసి రాయడం చాలా మంచి కార్యక్రమం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ దిలీప్ కుమార్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, ప్రవీణ్, సాయి హర్ష, అజిత్, గోండి కోఆర్డినేటర్ దేవరావు, కోలామి కోఆర్డినేటర్ యశ్వంత్‌రావు కొలామి, గోండి ఉపాధ్యాయులు, మోతీరాం కవి పాల్గొన్నారు.

నేడు సైన్స్ కళాశాలలో జాబ్ మేళా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో శనివారం టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో టాస్క్ వారి సౌజన్యంతో జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో ఎయిర్టెల్, పేమెంట్ బ్యాంక్, 24/7 ఏఐ, రిలయన్స్ జియో కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాకు అర్హతలు ఏదైనా డిగ్రీ, డిప్లమా కలిగి 2022, 2023, 2024 సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసి ఉండాలన్నారు. విద్యార్థులు ఇంటర్వ్యూకు వచ్చేటప్పుడు ఒక జత రెజ్యూమ్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఒరిజినల్ అండ్ జిరాక్స్ సెట్ ఐడీ ప్రూఫ్ తెచ్చుకోవాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి ఈ జాబ్ డ్రైవ్ ప్రారంభమవుతుందని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఎండీ.ఇమ్రాన్ అలీ 9703533626, డాక్టర్.ఎం.నర్సింగరావు 9441012766కు సంప్రదించాలని సూచించారు.

యువజన కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా విశ్వబోధి

నవతెలంగాణ-సిరికొండ



యువజన కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని సొంపల్లి గ్రామానికి చెందిన విశ్వబోధి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తనపై నమ్మకంతో రాష్ట్ర యువజన సంఘానికి, జిల్లా కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపిస్తామని అన్నారు.

ఆధ్యాత్మిక భావనతోనే ధైర్యం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆధ్యాత్మిక భావనతో మనందరికీ ధైర్యం వస్తుందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన సంప్రోక్షణ, యజ్ఞం కార్యక్రమాలలో కార్యకర్తలతో కలిసి పాల్గొని పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యంగా యువకులు హనుమంతున్ని ఆరాధిస్తే వారికి ధైర్యం, మనోబలం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా

నవతెలంగాణ-తాంసి

భీంపూర్, తాంసి మండలాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షిషా శుక్రవారం పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భీంపూర్ మండలంలో బెల్సారి రాంపూర్‌తో పాటు తాంసి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. తహసీల్దార్లు ఎంపీడీఓలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 41, 42 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మార్పులు చేయడం జరిగిందని, గత ఎన్నికలలో సరైన ర్యాంప్, టాయిలెట్స్, తదితర సౌకర్యాలు లేక పోవడంతో వీటిని మార్చడం జరుగుతుందని అన్నారు. తాంసి(బి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఖచ్చితంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు భీంపూర్ మండలంలోని బెల్సారీ రాంపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రిజిస్టర్లు, పిల్లలకు, తల్లులకు



అందిస్తున్న బాలమృతం, పౌష్టికాహారం, కోడిగుడ్ల వివరాలను, శ్యామ్ మామ్ పిల్లలు ఎవరైన ఉంటే వారిపై ప్రత్యేక శ్రద్ద వహించాలని బరువు పెరిగేలా, ఆరోగ్యంగా ఉన్నారా, తదితర వివరాలను అంగన్‌వాడీ టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో మాట్లాడుతూ పాటలు పాడించి, చాక్లెట్ ఇచ్చి అభినందించారు. అదే గ్రామానికి చెందిన హస్తకళాకారుడు స్వయంగా తయారు చేస్తున్న హస్త కళలని సందర్శించి, కావాల్సిన అన్ని సహాయ సహకారాలను అందిస్తామని అన్నారు. అనంతరం తాంసిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి అన్ని గదులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న చికిత్సల గురించి డాక్టర్‌ను అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు నారాయణరావు, లక్ష్మీ, ఎంపీడీఓలు మోహన్‌రెడ్డి, గోపాలకృష్ణ, తాంసి ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రావ్య, అయుష్ డాక్టర్. నర్మదా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎన్నికలేవైనా గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ-జైనథ్

ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని కాన్పమేడిగూడలో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకులు తుడుం రాములుతో పాటు పలువురు గ్రామస్తులు, యువత కంది శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ జెండా ఎగరేయాలన్నారు. విజయమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో కార్యకర్తలందరూ శక్తివంచన లేకుండా పాటుపడాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మంచి పరిపాలన సాగుతోందన్నారు. అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకెళ్తున్నట్టు పేర్కొన్నారు. పార్టీలో చేరినవారిలో భోయర్ రామారావు, గొర్ల బాపూరావు, సిలారి స్వామి, దుమ్మని లస్మన్న, పలువురు నాయకులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, నాగర్కర్ శంకర్, బాయిన్‌వార్ గంగారెడ్డి, యాల్ల పోతారెడ్డి, మాజీ ఎంపీటీసీ భూమన్న, రతన్‌రెడ్డి, రవిందర్ రెడ్డి, చారి, కయ్యుమ్, రఫీక్, కోరేటి కిషన్, సుధాకర్‌గౌడ్, మోహన్, తానాజీ, నిమ్మల ప్రభాకర్, సుకేందర్‌రెడ్డి, ఉశన్న, భూమయ్య, బూర్ల శంకరయ్య, మానే శంకర్, మహిపాల్‌రెడ్డి, చిత్రు, పోతన్న, నరోత్తంరెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

వందరోజుల్లో రూ.140 కోట్లు మంజూరు

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నవతెలంగాణ-భైంసా

తనను భారీ మెజారిటీతో గెలిపించిన ముధోల్ నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా అధికారం చేపట్టిన వందరోజుల్లోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.140 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి పనులు మంజూరు చేయించానని అన్నారు. ముధోల్ నుంచి పంచగుడి వరకు డబుల్‌లైన్ రోడ్డుకు రూ.30కోట్లు, ముధోల్‌లోని అంబేద్కర్‌చౌక్, గాంధీచౌక్, శివాజీ చౌక్ నుంచి జాతీయ రహదారికి కలిపే రోడ్డుకు రూ.8కోట్లు, కుభీర్ మండలంలోని అంతర్ని ఎక్స్‌రోడ్ నుంచి దివిశి వరకు రూ.2.50 కోట్లు, వీరేగాం తండా నుంచి మార్లగొండ రోడ్డుకు రూ.కోటి, తానూర్ నుంచి ధర్మాబాద్ రోడ్డుకు రూ.8 కోట్లు, మొత్తం రహదారుల నిర్మాణానికి రూ.49.50 కోట్ల నిధులతో పనులు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. అలాగే సాగునీటి పథకాలైన లోకేశ్వరం మండలంలోని పిప్రి ఎత్తిపోతల పథకానికి రూ.18 కోట్లు, కనకాపూర్ ఎత్తిపోతలకు రూ.1.40 కోట్లు, భైంసా మండలం సిరాల ప్రాజెక్టు పునరుద్ధరణకు రూ.12.37కోట్లు, మొత్తంగా రూ.31.77కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ముధోల్‌లోని కస్తూర్బా జూనియర్ కళాశాలకు రూ.2.30 కోట్లు, భైంసాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పీఎం ఉష కింద రూ.5 కోట్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కింద పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణానికి రూ.9.80 కోట్లు, భైంసా ప్రభుత్వ ఏరియాస్పత్రి అభివృద్ధికి రూ.35లక్షలు, సీసీరోడ్లు, డ్రైనేజీల కోసం ఉపాధిహామీ నిధులు రూ.12.80కోట్లు, గ్రామాల్లో తాగునీటి కోసం రూ.1.76 కోట్లు మంజూరయ్యాయని, మరో రూ.27కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదించగా, ఎన్నికల కోడ్ నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



నవతెలంగాణ-తలమడుగు

18 సంవత్సరాలు పూర్తయిన యువతీ, యువకులు తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా బీఎల్‌ఓలు కృషి చేయాలని తహసీల్దార్ రాజమోహన్ తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొద్దిరోజులు జరగబోతున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లను ఓటు వేసే విధంగా బిఎల్‌ఓలు కృషి చేయాలన్నారు. ఓటర్లు తమ ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయా లేవా లేనిపక్షంలో బీఎల్‌ఓను కలిసి నమోదు చేసుకోవాలన్నారు. 85 సంవత్సరాల పైబడ్డ వారు వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేసి ఓటు వేసే విధంగా బీఎల్‌ఓలు పనిచేయాలని కోరారు. ముఖ్య నాయకులైన పార్లమెంట్ సభ్యులు నియోజకవర్గ సభ్యుల పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయా లేదా బీఎల్‌ఓలు పరిశీలించాలన్నారు. ఓటరు జాబితాలో లేని వారి పేర్లను వెంటనే నమోదు చేసే విధంగా బీఎల్‌ఓలు పనిచేయాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో మజ్జిగ పంపిణీ

నవతెలంగాణ-నిర్మల్

ఎండ తీవ్రత పెరగడం వలన బస్సులలో డ్యూటీ చేస్తున్న డ్రైవర్, కండక్టర్‌లకు, గ్యారేజీ సిబ్బంది, ఆఫీస్ సిబ్బందికి శుక్రవారం ఆర్టీసీ నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడారు. ఉద్యోగులు ఎండ తాకిడికి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేడి గాలి సోకకుండా చెవులకు, తలకు తెల్లని టావెల్ ధరించి, డ్యూటీ చేయాలని అన్నారు. దూర ప్రాంతాలకు వెళ్ల ఉద్యోగులు డాబా దగ్గర ఆపకుండా ఇంటిభోజనం తీసుకెళ్లాలని సూచించారు. ఎక్కడ పడితే అక్కడ తిని ఆరోగ్యం పాడుచేసుకోవద్దని తెలిపారు. ఫుడ్ ఇన్ఫెక్షన్ అయి వాంతులు, విరోచనాలకు గురికావద్దని సూచించారు. త్వరలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తామని అన్నారు. వాటిని నీటిలో కలుపుకోని తాగాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్‌లు ఐ.రాజశేఖర్, నవీన్ కుమార్ ఉద్యోగులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని సోనాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు జాదవ్ ప్రకాష్ చినమ్మ జాదవ్ నీలాబాయి ఇటీవల అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న సిర్పూర్(యు) జెడ్పీటీసీ కోవ అరుణ శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా నీలాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట గ్రామ మాజీ సర్పంచ్ సుజాత పరమేశ్వర్, కుటుంబసభ్యులు శ్రీనివాస్, కిషన్ సింగ్, సోహన్ సింగ్, మహిళ నాయకురాలు విద్యారాణి ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన సీడీపీఓ సరిత



నవతెలంగాణ-కడెం

మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలైన గంగాపూర్, కుర్రతండా, రాణిగూడెం గ్రామా పంచాయతీ పరిధిలోని 7 అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం సీడీపీఓ సరిత ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందించే భోజనాన్ని, అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, బాలింతలకు, కిశోర బాలికలకు అందించే పోషకాహారలను ఆయా అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ మెనూ ప్రకారం ప్రతి లబ్ధిదారులకు ఫుడ్ సప్లమెంటరీ సక్రమంగా అందించాలని సిబ్బందికి ఆదేశించారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శహనాజ్ పర్వీన్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ వైద్యుడి మృతి

నవతెలంగాణ-కడెం



గత రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కడెం ప్రభుత్వాస్పత్రి వైద్యులు డాక్టర్ రాజ్ కుమార్ అకాల మరణం చెందారు. తెలిసిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్‌గా వైద్య సేవలందిస్తున్న నిజామాబాద్ జిల్లా మెండోర మండలంలోని సవెల గ్రామానికి చెందిన డాక్టరు రాజ్ కుమార్ (32) భుక్తాపూర్ గ్రామ సమీపంలో గత రాత్రి 11 గంటలకు కారు అదుపుతప్పి చెట్టును డీకొన్న ఘటనలో అక్కడికక్కడే మృతి చెందినట్లు కడెం వైద్య సిబ్బంది తెలిపారు. ఆయన ఆకాల మరణం పట్ల కడెం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్య సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

బోర్‌వెల్ రిచార్జ్ స్ట్రక్చర్ పనులు ప్రారంభం

నవతెలంగాణ-కడెం

ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని, మండలంలోని లింగపూర్ గ్రామంలోని బీసీ బాలుర వసతి గృహంలో బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్ పనులను శుక్రవారం డీఆర్డీఓ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి వర్షపు బొట్టు ఒడిసి పట్టాలనే నినాదాలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నీటిని పొదుపుగా వడుకోవాలని వృదగా పోనియవద్దని అన్నారు. నీటి విలువలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జయదేవ్, ఈసీ కవిత, టీఏ కాంతారావ్, ఎఫ్ఏ జెట్టి రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు



నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ మున్సిపల్ బీఆర్‌ఎస్‌కు చెందిన కౌన్సిలర్‌లు నల్లూరి పోశెట్టి, తారక వాణి రఘువీర్‌లు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసేంత వరకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గత పది సంవత్సరాల కాలంలో కుటుంబ పాలనలో విసిగిపోయిన బీఆర్‌ఎస్ నాయకులు, సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వంలో అందిస్తున్న పాలనకు ఆకర్షితులై పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎం జన్‌మన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

పీఎం జన్‌మన్ పథకాన్ని కొలాం, తోటి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ కుష్బు గుప్తా అన్నారు. శుక్రవారం కేబీ కాంప్లెక్స్ ఆవరణలోని పీఎమ్మార్సీలో భవనంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా వికాస కేంద్రాలలో ఎంపిక చేయబడిన పీవీటీజీ కొలాం, తోటి సభ్యులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఉత్పత్తి చేసే వస్తువుల తయారీ, మార్కెటింగ్, స్థాపన, శిక్షణల గురించి వివరించారు. కార్యక్రమంలో ట్రీఫెడ్, నిషబుడ్, డబ్ల్యూడీ అధికారులు, డీడీ, జేడీఎం, ఎన్‌జీఓల ప్రతినిధులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | మార్చి 23, 2024 | www.navatelangana.com

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలకేంద్ర సమీపంలోని పెద్దవాగులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మైనింగ్ శాఖ ఏడీ గంగాధర్ శుక్రవారం పట్టుకున్నారు. వారి వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ట్రాక్టర్‌ను తీసుకెళ్లి ఎస్ఐ కొమురయ్యకు అప్పగించారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కలెక్టర్, అదనపు కలెక్టర్లను కలిసిన డీఎం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన విశ్వనాథ్ శుక్రవారం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారిలను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు అందిస్తున్న సేవలు, మహాలక్ష్మి పథకం తదితర అంశాలపై చర్చించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఉన్నారు.

విద్యార్థులకు బ్యాంకు అకౌంట్స్ అందజేత



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని ఆరెగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఎస్బీఐ బ్యాంక్ జీరో అకౌంట్ ఫామ్స్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్శ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మేనేజర్ మెరుగు సందీప్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే పొదుపు అలవాటు పడాలని జీరో అకౌంట్‌తో ఉచితంగా బ్యాంకు అకౌంట్స్ ఓపెన్ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ కిరణ్ వర్మ, ఫీల్డ్ ఆఫీసర్ సామ్రాట్, పాఠశాల ఉపాధ్యాయులు జి.రవిశంకర్, ఎం.రాజేశం, రమేష్, ఫిరాసత్ అలీ, హస్మి, నీలిమ, శారద, ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి ప్రధాన ఉపాధ్యాయురాలు మానస, సీఆర్పీ తుకారాం పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమమే ఆర్టీసీ లక్ష్యం

- డిపో మేనేజర్ విశ్వనాథ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమమే తమ లక్ష్యమని డిపో మేనేజర్ విశ్వనాథ్ అన్నారు. డిపో పరిధిలోని ఉద్యోగులకు వేసవి నేపథ్యంలో ప్రతిరోజు పంపిణీ చేయనున్న నిమ్మరసం ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎం మాట్లాడుతూ ఎండి ఆదేశాల మేరకు ఉద్యోగులకు నిమ్మరసం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమమే తమ లక్ష్యమన్నారు. వేసవి కాలం ప్రారంభమైందని ఆర్టీసీ కార్మికులు నిమ్మరసం, నీళ్ల ఎక్కువగా తాగాలన్నారు. డిపోలో ఏర్పాటు చేసిన పంపిణీ కార్యక్రమాన్ని సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఐ సరియ, టీఐ 3 భారతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు మాతృవియోగం

- ఎమ్మెల్యే కోవ లక్ష్మీ నివాళ్లు



నవతెలంగాణ-కెరమెరి

మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెందూర్ ఆనంద్ తల్లి ఆశుబాయి(60) గురువారం రాత్రి మృతి చెందారు. ఆశుబాయి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గురువారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మీతో పాటు స్థానిక జెడ్పీటీసీ సెడ్మకి ద్రుపత బాయి అంత్యక్రియలకు హాజరయ్యారు. పెందూర్ ఆనంద్ రావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆశు బాయి మృతదేహాన్ని సందర్శించి నివాళ్లులర్పించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వారి వెంట నాయకులు మాడావి రఘునాథ్ ఉన్నారు.

26న స్థాయి సంఘ సమావేశాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 26న స్థాయి సంఘ సమావేశాలు ఉంటాయని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి అనీల్ కుమార ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 26న ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు స్థాయి సంఘం-7 (పనులు), స్థాయి సంఘం-1 (ప్రణాళిక, ఆర్థిక), 12.30 గంటల నుండి 1.30 గంటల వరకు స్థాయి సంఘం-2 (గ్రామీణ అభివృద్ధి), 1.30 గంటల నుండి 2.30 గంటల వరకు స్థాయి సంఘం-3 (వ్యవసాయం), 3 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు స్థాయి సంఘం-4 (విద్య, వైద్యం), 4 గంటల నుండి 5 గంటల వరకు స్థాయి సంఘం-5 (మహిళా సంక్షేమం), 5 గంటల నుండి 6 గంటల వరకు స్థాయి సంఘం-6 (సాంఘిక సంక్షేమం) సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని, సంబంధిత శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరుకావాలని సూచించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

నవతెలంగాణ-చింతలమానేపల్లి

పౌష్టికాహారంతోనే తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని కర్జెల్లి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా పోషన్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని, గర్భిణీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. పలు పౌష్టిక పోషక విలువలతో కూడిన ఆహారం గర్భిణీలు, బాలింతలకు అందజేశారు. కార్యక్రమంలో చింతలమానెపల్లి, కౌటాల, బెజ్జూర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శంకరమ్మ, సాహెరా బేగం, అరుణ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు మంగళ, వీణ, మాధవి పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో కృషి చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

లోక్‌సభ ఎన్నికలను జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి, ఎస్పీ సురేష్ కుమార్, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావు, ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్యతో కలిసి ఎన్నికల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్టోరల్ అధికారులు, పోలీసు సెక్టోరల్ అధికారులు తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించి పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధులు, గర్భిణుల కోసం ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంప్ సౌకర్యం ఉండాలని, పోలింగ్ కోసం కేంద్రాలకు వచ్చే ప్రజలకు తాగునీరు, నీడ, ఫ్యాన్లు ఇతర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఆసిఫాబాద్ శాసనసభ నియోజకవర్గ పరిధిలో 51 సెక్టార్లు ఏర్పాటు చేశామని, జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సిర్పూర్ లో 320, ఆసిఫాబాద్‌లో 356 పోలింగ్ కేంద్రాలు ఉండగా సహాయక పోలింగ్ కేంద్రాలతో మొత్తంగా 676 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన ఫర్నిచర్ అందుబాటులో ఉండాలని, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల సమన్వయంతో పని చేయాలని, ప్రతి సెక్టోరల్ అధికారి తన రూట్‌ను పరిశీలించాలని సూచించారు. సమస్యాత్మక, షాడో పోలింగ్ కేంద్రాలను గుర్తించి వివరాలు సమర్పించాలన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రానికి రాలేని 85 సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం హోం ఓటింగ్ ఏర్పాట్లు చేయాలని, తహసీల్దార్లు తమ పరిధిలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, బూత్ స్థాయి అధికారులను సమన్వయం చేసుకొని ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. పోలింగ్‌కు ముందు రోజు, పోలింగ్ రోజు విధి నిర్వహణలో పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ రోజు పోలింగ్ ప్రారంభానికి ముందు తప్పనిసరిగా మాక్ పోల్ నిర్వహించాలని, పోలింగ్ రోజున మాక్ పోలింగ్ ప్రక్రియలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలలో సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరించడానికి కృషి చేయాలని, ఉదయం 7 గంటలకు అసలు పోలింగ్ ప్రారంభించాలన్నారు. సెక్టోరల్ అధికారులకు అందించే చెక్ లిస్ట్, హ్యాండ్ బుక్, చేసేవి-చేయకూడని పనుల సంబంధిత పుస్తకాలను పూర్తిగా చదివి దగ్గర ఉంచుకోవాలని, ఎన్నికల నిబంధనల ప్రకారం పకడ్బందీగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు, సెక్టోరల్ అధికారులు, సెక్టోరల్ పోలీసు అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశాభివృద్ధి

- ఆదిలాబాద్ ఎంపీ టికెట్ ఆశావాహ అభ్యర్థి ఆత్రం సుగుణ



నవతెలంగాణ-జైనూర్

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంటు ఆశావాహి ఆత్రం సుగుణ అన్నారు. శుక్రవారం జైనూర్ మండలకేంద్రంలో ఆమె ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరాగా ఆమెను అభినందించారు. మండలవాసులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశాభివృద్ధి చెందాలంటే అది కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. దేశం అన్ని రంగాల్లో వెనుకబడి ఉందన్నారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయ్యే వరకు దేశాభివృద్ధి ముందుకుసాగదని తెలిపారు. కేంద్రంలో ఉన్న బీజేపీ గిరిజనులకు, ఆదివాసులకు ఎంతో అన్యాయం చేసిందని ఆరోపించారు. గత పది సంవత్సరాల నుండి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాలనలో దేశం ఎలాంటి అభివృద్ధి చెందలేదని తెలిపారు. అందువల్ల ఈసారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి బుద్ధి చెప్పాలని కోరారు. బీజేపీ అధికారంలోకి రావడంతో అహంకారం వచ్చిందని, బీజేపీని ఓడించాలంటే తనకు ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులుగా అవకాశమిచ్చి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజలకు సేవలందించేందుకే తాను రాజకీయంలోకి ప్రవేశించానని తెలిపారు. ఉమ్మడి జిల్లా ప్రజలు తనను ఆశీర్వదించి ఢిల్లీలో ఉన్న పార్లమెంటులో తొలి అడుగు పెట్టడానికి అవకాశమివ్వాలన్నారు. ఆదివాసీ మహిళలకు మొదటిసారిగా ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ టికెట్ ఇస్తే తమవంతు పోటీకి సిద్ధమన్నారు. అనంతరం గ్రామస్తులు, మండలవాసులు కృతజ్ఞతలు తెలుపుతూ ఆత్రం సుగుణకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సుద్దాల శ్రీనివాస్, ఇస్లామొద్దీన్, మారాల్వాయి మాజీ సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేష్, కనక గంగారాం, సమీర్ పాల్గొన్నారు.

అధిక ధరలకు మద్యం విక్రయాలపై ఫిర్యాదు



సీఐకి ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

చింతలమానెపల్లి మండలం గూడెం గ్రామంలో మద్యం దుకాణంలో అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుపుతున్నారంటూ ఎక్సైజ్ సీఐ జాన్ శామ్యూల్‌కు ఆ గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని మద్యం దుకాణంలో ప్రతి మద్యం బాటిల్‌పై రూ. 10 నుండి రూ. 100 వరకు అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుపుతున్నారంటూ సీఐకి ఫిర్యాదు చేయగా, స్పందించిన ఆయన వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఫిర్యాదు చేసిన వారిలో రామగిరి శంకర్, నికోడె దేవాజీ, మడె గిర్మాజీ, జాడి పురుషోత్తం, ప్రభాకర్, పత్రు, నాయకులు ఎల్ములె మల్లయ్య, సిందం శ్రీనివాస్ ఉన్నారు.

'నా శ్వాసల్లే నీ జ్ఞాపకం' వీడియో పాట విడుదల



సీడీని ఆవిష్కరిస్తున్న కళాకారులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌కు చెందిన చిప్పకుర్తి దేవదాసు రచించిన 'నా శ్వాసల్లే నీ జ్ఞాపకం' వీడియో పాట సీడీని శుక్రవారం కాగజ్‌నగర్‌లో విడుదల చేశారు. ప్రముఖ వైద్యుడు విద్యాసాగర్, ఎల్ఐసీ డెవలప్‌మెంట్ అధికారి విజయ్‌పాల్ రెడ్డి చేతుల మీదుగా ఈ సీడీని ఆవిష్కరించారు. గాయకుడు దిలీప్ దేవగన్ పాడిన ఈ పాటకు ఇంద్రజిత్ మ్యూజిక్ అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కళాకారులు ఈర్ల సునీల్, మిరాకిల్ మధు, అనిల్, రాజేష్, శ్రీశైలం యాదవ్, రిజ్వాన్, ఈర్త సత్యం, టిల్లు బాయ్ పాల్గొన్నారు.

పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలి



పోషకాహార విలువల గురించి వివరిస్తున్న సీడీపీఓ సురేఖ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని సీడీపీఓ సురేఖ అన్నారు. పోషణ పక్షోత్సవాలను పురస్కరించుకొని కాగజ్‌నగర్ పట్టణంలోని నిజాముద్దీన్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహార విలువల గురించి ఆమె వివరించారు. దీనికి ముందు గర్భిణీలకు సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పుష్ప, ప్రణీత, శారద పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఎంపీపీ రాజీనామా

నవతెలంగాణ-వాంకిడి

బీఆర్ఎస్ ఎంపీపీ ముండె విమలాబాయి పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో నాలుగున్నర సంవత్సరాల నుండి సేవలందించిన సరైన గుర్తింపు లేకపోవడంతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. మాజీ ఎంఎల్సీ పురాణం సతీష్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసినట్టు పేర్కొన్నారు. ఆమెతో పాటు సవాతి ఎంపీటీసీ మారుతి, సర్పంచ్‌లు కూడా ఆమె వెంటే రాజీనామా చేశారు. అయితే ఏ పార్టీలో చేరుతారనే స్పష్టత మాత్రం ఇవ్వలేదు.

ప్రత్యేక పూజలు చేసిన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు శుక్రవారం ప్రసిద్ధి చెందిన టోంకిని సిద్ధి హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీగా గెలవాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు ఆత్రం సక్కు తెలిపారు. ఆయన వెంట ఎమ్మెల్సీ దండే విఠల్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



నిరుపయోగంగా బస్టాండ్

- బస్సులు రాక ఇబ్బందులు
- బిచ్చగాళ్లకు నిలయంగా మారిన ప్రయాణ ప్రాంగణం



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలో 20 సంవత్సరాల క్రితం నిర్మించిన బస్టాండుకు బస్సులు రాక నిరుపయోగంగా మారింది. ప్రభుత్వాలు మారిన బస్టాండు రూపురేఖలు మారకపోవడంతో బస్సులు రాక బిచ్చగాళ్లకు నిలయంగా ఉంది. ఎండాకాలం, వర్షాకాలంలో నిలబడడానికి కూడా స్థలం లేకపోవడంతో దుకాణ సముదాయాల వద్ద నిలబడాల్సి వస్తుంది. ప్రజలకు ఉపయోగపడుతుందని నిర్మించిన బస్టాండు అలంకరంగా ఉంది. ప్రభుత్వాలు మారిన బస్టాండుకు బస్సులు రావడంలేదు. ఇప్పటికైనా కొత్తగా వచ్చిన ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండుకు బస్సులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తప్పుడు సర్టిఫికెట్‌తో బోదకాల పెన్షన్



నవతెలంగాణ-చింతలమానేపల్లి

ఎంపీపీ డుబ్బుల నానయ్య ప్రోత్సాహంతో అధికారులు గీత కార్మికుడినైన తన పెన్షన్ ఆపివేయడం సరికాదని, మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు రామగోని నీలాగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొన్ని నెలల నుండి గీత కార్మికునిగా వచ్చే తన పెన్షన్‌ను ఎంపీపీ నానయ్య ఆపించారని, అదే అధికార బలంతో ఎంపీపీ భార్యకు బోదకాలు లేకున్నా, తప్పుడు సర్టిఫికెట్లు పెట్టి కొన్నేండ్ల నుంచి పెన్షన్ పొందుతున్నట్లు ఆరోపించారు. డుబ్బుల నానయ్య తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. ఈ విషయంలో అధికారులకు ఫిర్యాదు చేశామని వెంటనే తనకు నిలిపివేసిన పింఛను మంజూరు చేయాలని కోరారు. ఆయన వెంట మండల నాయకులు డోకే రాజన్న ఉన్నారు.

ప్రయివేట్ బస్సు సేవలు వినియోగించుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ప్రయివేట్ బస్సు సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మీ అన్నారు. జిల్లా కేంద్రంలోని గుండి రోడ్డులో ఏర్పాటు చేస్తున్న ప్రయివేట్ ట్రావెల్స్ కార్యాలయాన్ని జెడ్పీటీసీ నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేస్తున్న ట్రావెల్స్ కెరమెరి నుండి హైదరాబాద్‌కు సర్వీస్ నడపనున్నట్లు నిర్వాహకులు తెలిపారన్నారు. ఇది గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

గిరి గ్రామాల్లో సెల్ టవర్ల ఏర్పాటుకు మార్గం సుగమం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాలలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఈ విషయాన్ని బీఎస్ఎన్ఎల్ ఆదిలాబాద్ డిప్యూటీ జనరల్ మేనేజర్ జి.జగ్‌రాం ధృవీకరించారు. జిల్లాలోని కెరమెరి, తిర్యాణి, పెంచికల్‌పేట్, దహెగాం, చింతలమానెపల్లి మండలాలలోని గిరిజన గ్రామాల ప్రజలు సెల్ టవర్లు లేక అనేక అవస్థలు పడుతున్నారు. ఈ గ్రామాలలో సెల్ టవర్ల ఏర్పాటుకు అటవీ శాఖ నుండి అనుమతులు రాక జాప్యం జరిగింది. ప్రస్తుతం అనుమతులు వచ్చాయని, త్వరలోనే ఆయా మండలాలలో సెల్ టవర్ల నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు జగ్‌రాం తెలిపారు. ఈ టవర్లు ఏర్పాటయితే సిగ్నల్స్ లేక అవస్థలు పడుతున్న గిరిజన గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడిని పరామర్శించిన జెడ్పీటీసీ

నవతెలంగాణ-వాంకిడి

బీఆర్ఎస్ విద్యార్థి రాష్ట్ర నాయకుడు రాజ్‌కుమార్‌ను జెడ్పీటీసీ అజయ్‌కుమార్ పరామర్శించారు. హైదరాబాద్‌లోని కోటి ఈఎన్‌టీ ఆస్పత్రిలో గొంతు అపరేషన్ చేసుకున్న ఆయన్ను కలిసి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఆపరేషన్‌కు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి ఆస్పత్రి యజమానులతో మాట్లాడి ఆపరేషన్ చేయించడం జరిగిందని జెడ్పీటీసీ తెలిపారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎలాంటి ఆపదలు వచ్చిన పార్టీ అండగా ఉంటుందని ఆయన తెలిపారు.

రేపు సామల సదాశివ సాహితీ పురస్కారం ప్రదానం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

డాక్టర్ సామల సదాశివ సాహితీ పురస్కారం-2023 ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఈ నెల 24న కాగజ్‌నగర్ పట్టణంలోని పద్మశాలి భవన్‌లో నిర్వహించనున్నట్లు తెలుగు సాహితీ సదస్సు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన కవి, రచయిత చెరుకు సత్యనారాయణరెడ్డికి ఈ పురస్కారం అందించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పెండ్యాల కిషన్‌శర్మ రచించిన 'సుందరకాండ' పద్య కావ్యం, గురిజాల రవీందర్ రచించిన 'బొగ్గు రవ్వలు' పుస్తకాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. సాహితీ అభిమానులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన

నవతెలంగాణ-జన్నారం



ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలల, గిరిజన ఆశ్రమ పాఠశాలలో వేరువేరుగా క్షయ వ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల ప్రభుత్వ వైద్యురాలు డా. ఉమాశ్రీ పాల్గొని మాట్లాడుతూ క్షయ వ్యాధిని గుర్తించడం, నిర్మూలించడంపై విద్యార్థులకు అవగాహన కల్పించామని తెలిపారు. అనంతరం ఆయా పాఠశాలలో విద్యార్థులకు క్షయ వ్యాధి నిర్మూలనపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సురేష్, ఆరోగ్య సిబ్బంది, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై జీఎంకు వినతి

నవతెలంగాణ-మందమర్రి



కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏరియా జనరల్ మేనేజర్ మనోహర్‌ను కలిసి వినతిపత్రాన్ని ఇచ్చారు. ఏరియాలోని గనులు డిపార్ట్‌మెంట్ కార్యాలయాలలో విభాగాలలో పనిచేసే ఉద్యోగులకు సరైన వసతులు లేక ఇబ్బందికి గురవుతున్నారని తెలిపారు. ఫర్నిచర్, ప్రింటర్స్, ఫ్యాన్లు, కూలర్లు, అవసరమైన స్థలాల్లో ఎయిర్ కండిషర్లు సమకూర్చాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి బ్రాంచ్ సెక్రటరి సలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరి దాగం మల్లేష్, రామకృష్ణాపూర్ బ్రాంచ్ సెక్రటరీ అరకొండ ఆంజనేయులు, దాసరి తిరుపతి గౌడ్, ఫిట్ సెక్రటరిలు పాల్గొన్నారు.

మండలంలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కుమారుడు గడ్డం వంశీకృష్ణకు పెద్దపల్లి పార్లమెంట్ టికెట్ ఖరారు కావడంతో పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. గురువారం రాత్రి ఏఐసీసీ విడుదల చేసిన ప్రకటనలో గడ్డం వంశీకృష్ణ పేరుండటంతో టేకుమట్ల గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ గోనె సుమలత నర్సయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం ఉదయం భీమారం మండల కేంద్రంలో స్థానిక పార్టీ అధ్యక్షులు మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జెడ్పీటీసీ తిరుమల లక్ష్మన్‌తో పాటు శ్రేణులు బస్టాండ్‌లో భారీగా బాణసంచా పేల్చి స్వీట్లు పంచుకున్నారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో పార్టీ అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణకు అత్యధిక మెజార్టీ గెలిపిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా జైపూర్ కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ ఫయాజోద్దీన్ ఆధ్వర్యంలో మండల పరిధిలో గల వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు ఇందారం గ్రామంలో సంబరాలు చేసుకున్నారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణకు టికెట్ కెటాయించినందుకు అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఆర్పీ1 గనిని సందర్శించిన ఏఐటీయూసీ నాయకులు



నవతెలంగాణ-నస్పూర్

ఎస్ఆర్పీ 1 గనిలో గురువారం జరిగిన ప్రమాదం ఘటన స్థలాన్ని శుక్రవారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యానికి ఉత్పత్తిపై ఉన్న దృష్టి కార్మికుల రక్షణపై లేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రమాదాలతో సాధించే ఉత్పత్తి ఉత్పత్తి కాదన్నారు. యాజమాన్యం సేఫ్టీ ట్రైపార్టైడ్ సమావేశాలు నిర్వహించకపోవడం వల్లే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే యాజమాన్యం సేఫ్టీ ట్రైపార్టైడ్ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం గని ప్రమాదంలో రెండు పాదాలు కోల్పోయిన సత్యనారాయణను కరీంనగర్‌లోని మెడికవర్ ఆస్పత్రికి వెళ్లి కార్మికున్ని పరామర్శించి మనోధైర్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, గని ఫిట్ కార్యదర్శి దాడి రాజయ్య, నాయకులు అఫ్రోజ్ ఖాన్, కామెర వేణు పాల్గొన్నారు.

పనుల నిర్వహణలో సమయపాలన పాటించాలి



నవతెలంగాణ-జైపూర్

వేసవి ఎండలు ముదురుతున్నందున ఈజీఎస్ పనుల్లో కూలీలు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ గుర్రం సత్యనారాయణ గౌడ్ అన్నారు. శుక్రవారం పెగడపల్లి శివారులో నిర్మిస్తున్న ఫార్మేషన్ రోడ్డు పనులతో పాటు దుబ్బపల్లి శివారులో చేపట్టిన పర్క్యులేషన్ ట్యాంక్ పనులు పరిశీలించారు. రోజువారిగా ఉపాధి హామీ కూలీల హాజరు శాతం పెంచుకుంటూ నిర్దేశిత సమయంలో ఈజీఎస్ ద్వార గుర్తించిన పనుల పూర్తికి కృషి చేస్తున్నామని తెలిపారు. గతం కంటే మండల పరిధిలో కూలీల హాజరు శాతం పెరుగుతున్నట్లు తెలిపిన ఆయన వేసవి ఎండల్లో పనుల నిర్వాహణ పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

కారును ఢీకొట్టిన ఆయిల్ ట్యాంకర్

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధి ఇందారం ఎక్స్ రోడ్డు సమీపంలో శుక్రవారం సాయంత్రం ఆయిల్ ట్యాంకర్ కారును ఢీకొట్టింది. చెన్నూర్ నుండి మంచిర్యాల వైపు వెళ్తున్న కారును వెనుక నుండి వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రాణహాని జరుగకపోయినా కారు నుజ్జునుజ్జు అయ్యింది.. రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మించి ఉండగా ఇరువైపుల రోడ్డు ఇరుకుగా ఉండటంతో కారును ఓవర్ టేక్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఆయిల్ ట్యాంకర్ కారును ఢీకొట్టింది.. వాహనాల రాకపోకలతో ఎప్పుడు రద్దీగా ఉండే ఈ రోడ్డును విస్తరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉంచాలి

- జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్



నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వ ఉద్యోగాలు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ అభ్యర్థులకు అవసరమైన పత్రికలు, పుస్తకాలు, మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్‌తో కలిసి సందర్శించి సౌకర్యాలు, రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధి దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రంథాలయాలలో పాఠకులకు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన పత్రికలు, పుస్తకాలు, ఇతర మెటీరియల్‌ను అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. పోటీ పరీక్షల అభ్యర్థులు గ్రంథాలయాలో లభించే మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షలలో విజయం సాధించాలన్నారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకులు, అభ్యర్థులు తప్పనిసరిగా సభ్యత్వం తీసుకోవాలని, సభ్యత్వం తీసుకున్న వారికి గుర్తింపు కార్డులు జారీ చేసి వారిని గ్రంథాలయంలోనికి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. వేసవి కాలం నేపథ్యంలో గ్రంథాలయానికి వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా తాగునీరు, విద్యుత్ సరఫరా ఇతరత్రా సౌకర్యాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఓసీలోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌ను సందర్శించిన డైరెక్టర్

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఉపరితల గనిలోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌ను శుక్రవారం డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణ, శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఏరియా స్టోర్స్‌లో శ్రీరాంపూర్ ఏరియాకు సంబంధించిన వివిధ గనుల విభాగాలకు కావాల్సినన్ని పనిముట్లు అందుబాటులో ఉన్నాయా లేదా అని తెలుసుకున్నారు. అలాగే ఉపరితల గనులకు కావాల్సిన భారీ యంత్రాల పనిముట్లను వీలైనంత ఎక్కువగా ఉంచుకోవాలని సూచించారు. శ్రీరాంపూర్ ఉపరితలగనిలోని కంట్రోల్ రూమ్, సెకండరీ సైజర్, సీ2 కన్వేయర్ బెల్ట్ వద్ద బొగ్గు రవాణను ప్రత్యక్షంగా పరిశీలించారు. నిరంతరం బొగ్గు రవాణా చేయాలని సంబంధిత అధికారులను డైరెక్టర్ ఆదేశించారు. ఉపరితల గనులలో పనిచేస్తున్న కార్మికులు వేసవికాలం దృష్టిలో ఉంచుకొని తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ స్టోర్స్ మాచరయ్య, ఎస్ఓ టు డైరెక్టర్ (ఈఅండ్ఎం) వీవీ. రావు, ఆఫీస్ ఆఫ్ జనరల్ మేనేజర్ సీహెచ్‌పీ కేశవరావు, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ప్రాజెక్టు ఆఫీసర్ టి శ్రీనివాస్, డీజీఎం ఏరియా స్టోర్స్ యాదయ్య, డీజీఎం ఏరియా వర్క్ షాప్ రవీందర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ చంద్రశేఖర్, గని మేనేజర్ బ్రహ్మాజీ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : ఓఎస్‌డీగా నియమించబడ్డ ఎస్డీఎం సుభాని, మందమర్రి ఏరియా జీఎం మనోహర్ కెకె, ఆర్కే ఓసిలలో శుక్రవారం సందర్శించారు. ఈ ఆర్థిక సంవత్సరం మిగిలిన పని దినాలలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, రవాణ లక్ష్య సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత ప్రాజెక్టు ఆఫీసర్లు, ,మేనేజర్లకు, ఇతర అధికారులకు సూచనలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్కె ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏం గోవిందరావు, మేనేజర్ సుధీర్ జక్కులవార్, సీనియర్ సర్వే ఆఫీసర్ ఎం శేఖర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ పి.మహేందర్, సేఫ్టీ ఆఫీసర్ కె. రామరాజు, కెకె ఓసి ప్రాజెక్టు ఆఫీసర్ రమేశ్, ప్రాజెక్ట్ ఇంజనీర్ సూర్య నారాయణ, రాజు పాల్గొన్నారు.



నస్పూర్



రామకృష్ణాపూర్

ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు ఎదుట ఖాళీ బిందెలతో నిరసన



క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన

నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట శుక్రవారం గుడిసెవాసులు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. పీఓడబ్ల్యూ మంచిర్యాల జిల్లా నాయకురాలు మద్దెల భవాని ఆధ్వర్యంలో ధర్నా చేపట్టిన గుడిసెలకు నీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. 11 నెలలుగా గుడిసెవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మద్దెల భవాని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్నిల్లో గెలిపిస్తే బోరుబావులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే మర్చిపోయారని ఆరోపించారు. ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేగా వివేక్ వెంకటస్వామి నియోజకవర్గంలో పర్యటిస్తున్న క్రమంలో నీటి ఇబ్బందుల పట్ల స్పందించి బోరుబావులు ఏర్పాటు చేస్తుండగా గుడిసెవాసులను మాత్రం మర్చిపోయారని విమర్శించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి స్పందించి బోరుబావులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గుడిసెల ఏరియా నీటి సమస్యను పరిష్కరించకుంటే పెద్ద సంఖ్యలో ప్రగతి భవన్ చేరకుంటామని మద్దెల భవాని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భూపోరాట కమిటీ నాయకులు ప్రసన్న, రుక్మిణీ, సూజాత, రేవతి, ప్రియాంక, పద్మ, పీఓడబ్ల్యూ జిల్లా నాయకులు శిరీష పాల్గొన్నారు.

రోజువారి ఆహారంగా తృణధాన్యాలు తీసుకోవాలి

నవతెలంగాణ-జైపూర్

ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతి రోజు తృణధాన్యాలు ఆహారంగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత అన్నారు. శుక్రవారం రామారావుపేట్ గ్రామంలో అంగన్‌వాడి కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సంధర్బంగా హాజరైన సూపర్‌వైజర్ గర్భిణీ స్త్రీలు, బాలింతలకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రతి రోజు తాజా ఆకు కూరలు, పాలు, పండ్లు, గుడ్లు ఆహారంగా తీసుకోవాలన్నారు. ఈ సంధర్బంగా ఆరోగ్యకరమైన ఆహారం పట్ల అవగాహణ కల్పించారు. అదేవిధంగా గర్భిణీలతో పాటు బాలింతలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. పిల్లల ఎదుగుదల విషయమై నెల రోజులకు ఒకసారి అంగన్‌వాడి కేంద్రంలో బరువు సరిచూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌తో పాటు అంగన్‌వాడి కార్యకర్తలు విజయ, అంజలి, జ్యోతి, ఆయాలు పాల్గొన్నారు.

గడ్డం వంశీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం

- కాంగ్రెస్ నాయకులు సొతుకు సుదర్శన్

నవతెలంగాణ-మందమర్రి

పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని కాంగ్రెస్ సీనియర్ నాయకులు సొతుకు సుదర్శన్ అన్నారు. పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్ గడ్డం వంశీకృష్ణకు ఇచ్చిన సందర్భంగా శుక్రవారం రాత్రి పాత బస్టాండ్ ప్రాంతంలో కాంగ్రెస్ నాయకులు బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ సీటును దివంగత మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి మనవడు, మాజీ ఎంపీ ప్రస్తుత చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ కుమారుడు గడ్డం వంశీకృష్ణను ప్రకటించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. దీనికి సహకరించిన పార్టీ అధిష్టానానికి, రాష్ట్ర ఇన్‌చార్జ్ దీప్‌దాస్ మున్సి, సీఎం రేవంత్‌రెడ్డి, సహకరించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజాసేవే లక్ష్యంగా ముందుకెళుతున్న గడ్డం వంశీకృష్ణకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అందరం కలిసికట్టుగా గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి జమీల్, మాజీ పట్టణ అధ్యక్షులు మంకు రమేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వేటూరి సత్యనారాయణ, పోలు శ్రీనివాస్, ఆలం శంకర్, కడలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత



నవతెలంగాణ-మందమర్రి

టాస్క్‌ఫోర్స్ పోలీసులు గంజాయి తరలిస్తున్న యువకుడిని శుక్రవారం పట్టుకొని కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెంచు కాలనికి చెందిన ఆవుల షారుక్(19) గంజాయి తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. చెంచుకాలనీ రైల్వేట్రాక్ వద్ద నుంచి గంజాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా, అతని వద్ద 1100 గ్రాముల గంజాయి లభ్యమైంది. కొంతకాలంగా తన సోదరుడు లాడెన్‌తో కలిసి గంజాయి వ్యాపారం కొనసాగిస్తున్నాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని ఉద్దేశంతో మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి గంజాయిని తీసుకువచ్చి స్థానికంగా విక్రయిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. అదేవిధంగా మారుతీనగర్‌కు చెందిన మక్కల గంగాధర్(18) చెంచు కాలనీ సమీపంలో గంజాయి అమ్ముతున్నట్టు సమాచారంతో ఎస్ఐ రాజశేఖర్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా, అతని వద్ద 500 గ్రాముల గంజాయి లభ్యమైంది. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ గంజాయి అమ్మే వాళ్ల తాగేవారిపై ఎల్లప్పుడూ నిఘా ఉంటుందని, వాళ్లపైన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని విద్యాసంస్థల నందు ఎన్‌డీపీఎస్ చట్టం గురించి అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసి విద్యార్థులను చైతన్యవంతులను చేసి భవిష్యత్తులో మాదకద్రవ్యాలను వినియోగించకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. అనివార్య పరిస్థితుల వల్ల జల్సాలకు అలవాటు పడి డబ్బు సంపాదనే ప్రధాన లక్ష్యంగా చేసుకుని, జీవించే కొన్ని అసాంఘిక శక్తుల వల్ల యువత పెడదారి పడుతోందని తెలిపారు.

అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలు



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని జాతీయ రహదారి 363ని ఆనుకొని ఎలాంటి అనుమతులు లేకుండా యాదేచ్చగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. గతంలో జాతీయ రహదారి 363కి ప్రభుత్వం కొంతమేర భూమిని తీసుకొని భూ నిర్వాసితులకు నష్టపరిహారాన్ని కూడా చెల్లించారు. ప్రభుత్వం నుండి రావాల్సిన లబ్దిని పొందిన కూడా ఖాళీగా ఉన్న స్థలంలో అక్రమ నిర్మాణాన్ని చేపడుతున్నారు. గతంలో కూడా కొంతమంది అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఖాళీ స్థలాలలో నిర్మాణాలు చేపడుతున్న ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు చూసి చూడనట్టుగా వ్యవరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శాలివాహనుడి చరిత్రను భావితరాలకు అందించాలి



నవతెలంగాణ-జన్నారం

శాలివాహనుడి చరిత్రను భావితరాలకు అందించాలని బీసీ కులాల ఐక్య ఉద్యమ పోరాట సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరు చంద్రయ్య అన్నారు.శుక్రవారం శాలివాహనుడి జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాలివాహనుడి చరిత్రను భావితరాలకు అందించడంతో పాటు ఆయన సేవల గురించి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యమ పోరాట సమితి కరీంనగర్ జోన్ కన్వీనర్ కే ఏ నర్సింహులు, ఉమ్మడి జిల్లా కో కన్వీనర్ కోడిజుట్టు రాజయ్య, మంచిర్యాల జిల్లా కన్వీనర్ ఆడెపు లక్ష్మీనారాయణ, ఐలవేని రవి, మామిడి విజయ్, దండవేని శ్రీధర్, కానుగంటి లక్ష్మణ్ వర్మ అన్నారపు అశోక్, ముత్యం సంతోష్, పేరం మహేందర్, అల్లం సురేష్, కొండగొర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రక్షణపై సమీక్షా సమావేశం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో జీఎం సంజీవరెడ్డి అధ్యక్షతన ఏరియా అధికారులతో శుక్రవారం రక్షణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం ఎస్ఆర్పీ1 గనిలో జరిగిన ప్రమాదంపై కూలంకషంగా చర్చించి ఇటువంటి ప్రమాదాలు మళ్లీ పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన రక్షణ చర్యల గురించి చర్చించారు. అలాగే మార్చి 23 నుండి 27 వరకు సేఫ్టీ ఆడిట్ హాలేజ్, మ్యాన్ రైడింగ్ సిస్టంపై శ్రీరాంపూర్ ఏరియాలో ఉన్న అన్ని గనులలో నిర్వహించడం జరుగుతుందని, ప్రతి గనిలో రక్షణ చర్యలను ఈ ఆడిట్ కమిటీ తనిఖీ చేయడం జరుగుతుందని, తనిఖీ చేసిన అంశాలను రిపోర్టు రూపంలో అందజేస్తుందన్నారు. ఉద్యోగుల రక్షణ ఎల్లవేళలా పై అధికారులు చూస్తూ ఉండాలని దానికి కావాల్సిన అన్ని సదుపాయాలు అధికారులు ఎల్లవేళలా పర్యవేక్షిస్తుండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం పురుషోత్తమ రెడ్డి, ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాస్, ఏజెంట్లు ఏపీ రెడ్డి, శ్రీరాముడు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, అన్ని గనుల మేనేజర్లు, సేఫ్టీ ఆఫీసర్స్, గ్రూప్ ఇంజనీర్లు, పిట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానించి గడ్డం బ్రదర్స్



నవతెలంగాణ-జైపూర్

కాంగ్రెస్‌పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. తనయుడు వంశీకృష్ణతో పాటు గడ్డం బ్రదర్స్ చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివక్ వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌లు సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సంధర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి పుష్పగుచ్చం అందజేసిన గడ్డం వంశీకృష్ణ శాలువాతో సన్మానించారు. అంతకు ముందు తండ్రి మంత్రి శ్రీధర్ బాబును కలిసి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గడ్డం బ్రదర్స్‌తో పాటు మంత్రి జూపల్లి కృష్ణారావు, షబ్బీర్ అలీ, మల్లు రవి ఉన్నారు.

యువతి అదృశ్యం

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని ఎల్లనగర్ గ్రామానికి సునిత అనే యువతి అదృశ్యమైంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లనగర్‌కు చెందిన సునిత శుక్రవారం ఉదయం నుంచి కనిపించడం లేదు. గురువారం మధ్యాహ్నం కూరగాయల కోసం అమె వెళ్లింది. అదే సమయంలో మహారాష్ట్రకు చెందిన అంకూష్ ఆమె ఇంటి చుట్టూ చక్కర్లు కొట్టాడు. గమనించిన సునిత అక్క సారక్క ఆయన్ను నిలదీసింది. గురువారం సాయంత్రం కూరగాయలు తీసుకుని ఇంటికి వచ్చిన సునిత శుక్రవారం తెల్లవారు జామునుంచి కనిపించకుండా పోయింది. ఇదే విషయమై తండ్రి ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. అయితే కుటుంబ సభ్యులకు అంకూష్‌పై అనుమానం ఉందని ఆ కోణంలో విచారణ చేపుడతామని ఎస్సై పేర్కొన్నారు.

అక్రమ ఇసుక నిల్వలపై అధికారుల కొరడా

నవతెలంగాణ-రెబ్బెన

రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ అధికారులు శుక్రవారం అక్రమంగా నిర్వహిస్తున్న ఇసుక దందాపై కొరడా ఝుళిపించారు. ఎఎస్పీ ఎస్.అచ్చేశ్వర్‌రావు ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్టు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వరుణ్‌ప్రసాద్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పలు ప్రాంతాలలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులు పట్టుకున్నట్టుగా తెలిపారు. మండలంలోని వివిధ ప్రాంతాలలో రెవెన్యూ అధికారులతో కలిసి అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న సుమారు 300 టన్నుల ఇసుక డంపులతో పాటు రెండు ఇసుక లారీలు, ఒక జేసీబీని సీజ్ చేసి, పలువురిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ప్రశాంత్, సిబ్బంది ఎస్సై నారాయణ, పీసీలు అశోక్, అనిల్, సంపత్ పాల్గొన్నారు.



పాఠశాల స్థలం కబ్జా

● చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-బెజ్జూరు

మండలంలోని లంబడిగూడ గ్రామ పంచాయతీలో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం కూల్చి స్థలం కబ్జా చేశారని శుక్రవారం తహసీల్దార్ భువనేశ్వర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ పాఠశాల భవనం కూల్చివేసి దానిని ఆక్రమించుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

ఒకరి మృతికి కారకుడైన వ్యక్తికి 5సంవత్సరాల జైలు

● రూ.15వందల జరిమానా

నవతెలంగాణ-నిర్మల్

ఒకరి మృతికి కారకుడైన వ్యక్తికి 5 సంవత్సరాలు కఠిన కారగార జైలు శిక్షతో పాటు రూ.15వందల జరిమానాను శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.కర్ణ కుమార్ విధించారు. కోర్టు లైజనింగ్ అధికారి, ఎస్సై సక్రియ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం... నిర్మల్ రూరల్ మండలంలోని నిలాయిపేట్ గ్రామానికి చెందిన నల్ల లక్ష్మణ్‌కు గ్రామ శివారంలో 2 ఎకరాల 11 గుంటల పంట భూమి ఉంది. ఈ భూమిలో మొక్కజొన్న పండించేవాడు. అడవి పందులు, జంతువుల నుంచి పంటను రాత్రి వేళల్లో రక్షించేందుకు అక్రమంగా పంట చుట్టూ విద్యుత్తు తీగలను అమర్చేవాడు. అదే గ్రామానికి చెందిన మృతుడు గంగోని బుచ్చన్న(52) అనునతని చేను ఉంది. తన చేనులో ఉన్న పంటను అడవి పందుల నష్టం కలగచేస్తావని కావలిగా ఎప్పటిలాగే వెళ్లేవాడు. 2017 సెప్టెంబర్ 16న రాత్రి రోజువారీగా తన పంటకు రక్షణగా వెళ్లాడు. ఈ మేరకు నల్ల లక్ష్మణ్ తన చేను చుట్టు ఉన్న జీఐ వైరకు కరెంట్ కనెక్షన్ ఇచ్చిన విషయం తెలియక ఆ జీఐ వైరకు కరెంట్‌కు తగలగానే కరెంట్ షాక్ తగిలి బుచ్చన్న మృతి చెందాడు. ఈ విషయాన్ని మృతుని కుమారుడు గంగొని మనోహర్ నిర్మల్ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై సునీల్ కుమార్ కేసు నమోదు చేసుకున్నారు. విచారణ అనంతరం డీఎస్పీ జీవన్‌రెడ్డికి అప్పగించారు. అనంతరం నేరస్తుని అరెస్టుచేసి, నేరస్తునితో పాటు పరిశోదన చేసిన చార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. ఈ మేరకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్‌రావు 10 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా, సాక్షులు చెప్పిన సాక్షం కోర్టులో రుజువు కావడంతో నిర్మల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.కర్ణ కుమార్ నిందితునికి శిక్ష విధిస్తూ తీర్పును వెలువరించారు.

అక్రమ మద్యం పట్టివేత

● రూ.55వేల విలువగల 50 లీటర్ల మద్యం స్వాధీనం



నవతెలంగాణ-ముధోల్

మండలంలోని బోరిగాం, గన్నోర గ్రామాల్లో అక్రమంగా ఇంట్లో నిల్వ ఉంచిన మద్యాన్ని శుక్రవారం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని గన్నోర గ్రామానికి చెందిన రవి ఇంట్లో అనుమతి లేకుండా అక్రమంగా బెల్ట్ షాప్ నడుపుతున్నాడనే సమాచారం మేరకు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో రూ.26వేల విలువ గల 24 లీటర్ల మద్యం, బోరిగాం గ్రామంలో రాజు అక్రమంగా నిల్వ ఉంచిన రూ.29 వేల విలువ గల 26 లీటర్ల నిలువ ఉంచి, విక్రయిస్తున్న అక్రమ మద్యం ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో ఎవరు అక్రమంగా మద్యం విక్రయించ కూడదని పేర్కొన్నారు.

అన్వేష్‌రెడ్డికి సన్మానం

నవతెలంగాణ-ఏర్గట్ల/ముప్కాల్

రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులై మొట్టమొదటి సారిగా ఆయన స్వగ్రామానికి వచ్చిన సందర్భంగా కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అన్వేష్ రెడ్డిని మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం కలిసి శాలువతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అన్వేష్ రెడ్డి మరెన్నో ఉన్నతమైన పదవులను అధిరోహించి, ప్రజలకు సేవలందించాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, కిసాన్ ఖేత్ మండలాధ్యక్షులు ముస్కు మోహన్ రెడ్డి, డీసీసీ డెలిగేట్ గడ్డం జీవన్, కాంగ్రెస్ నాయకులు బద్దం లింగారెడ్డి, కురాకుల బొర్రన్న, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: తెలంగాణ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్ రెడ్డిని శుక్రవారం ఆయన నివాసంలో మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అన్వేష్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు ఎస్.రాజ్ కుమార్ మాట్లాడుతూ అన్వేష్ రెడ్డి రైతుల కోసం చేసిన కృషికి 'రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్' ఛైర్మన్ పదవి దక్కడం హర్షించదగ్గ విషయమన్నారు. మున్ముందు మరెన్నో ఉన్నతమైన పదవులు పొందాలని ఆకాంక్షించారు. అన్వేష్ రెడ్డిని కలిసిన వారిలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు రాజ్ కుమార్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, జిల్లా రైతు నాయకులు ఏలేటి మల్లారెడ్డి ఉన్నారు.

పిల్లల్లో ఏదో ఒక కళ ఉండడం సహజం

● సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ జీపీవీ కుమార్

నవతెలంగాణ-ముప్కాల్

పిల్లల పెంపకం-ఒక కళ అనే అంశంపై ముప్కాల్ కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులకు సెమినార్ నిర్వహించారు. జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ జీపీవి.కుమార్ మాట్లాడుతూ పిల్లల్లో ఏదో ఒక కళ ఉండడం సహజమన్నారు. పిల్లల పెంపకంపై పలు విషయాలను వివరించారు. మరొక ముఖ్య వక్త, కృష్ణవేణి ఉన్నత పాఠశాల జోనల్ ఇంచార్జ్ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాపించిన అనతి కాలంలోనే విద్యార్థుల సంఖ్యను పెంపొందించుకుని, విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననలను పొందడం హర్షించదగ్గ విషయమన్నారు. వచ్చే విద్యాసంవత్సరం 9వ తరగతి ప్రవేశ పెట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోట ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్ చవాన్, వేల్పూర్ కేటీఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ పులి శ్రీనివాస్, డైరెక్టర్లు ధర్మపురి, నర్సయ్య, రాజేందర్, ఉపాధ్యాయ బృందం, పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

● ఎస్పీ సురేష్ కుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రేహౌండ్స్ సిబ్బంది ప్రత్యేక శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో గ్రేహౌండ్స్‌కు ఇస్తున్న శిక్షణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వారం రోజుల శిక్షణ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీస్ సిబ్బంది శారీరక ధారుఢ్యం కోసం, మావోయిస్టు కదలికలపై ప్రత్యేక నిఘా కోసం ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు, చెక్ పోస్ట్‌ల వద్ద డ్యూటీలు, వాహనాల ముమ్మర తనిఖీలు, ఇతర పోలీస్ సంబంధిత విధుల నిర్వహణకు తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్, డీఎస్పీ సదయ్య, సీఐ సతీష్ , ఆర్ఐ పెద్దన్న, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పారా మిలిటరీ దళాల ఫ్లాగ్ మార్చ్

జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన కేంద్ర పారా మిలిటరీ దళాల ఫ్లాగ్ మార్చ్‌ను ఎస్పీ సురేష్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. పారా మిలిటరీ దళాలతో కలిసి పట్టణంలోని అంబేద్కర్ చౌక్, పొట్టి శ్రీరాములు విగ్రహం, వివేకనంద విగ్రహం, మార్కెట్ ఏరియా వీధుల గుండా కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు. శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్, డీఎస్పీ సదయ్య, సీఐలు సతీష్, శ్రీనివాస్, చిట్టిబాబు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణలో పోలీసులకు భోజనం వడ్డిస్తున్న ఎస్పీ సురేష్ కుమార్



కేంద్ర బలగాల కవాతులో ఎస్పీ సురేష్ కుమార్

అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

● డిగ్రీ కళాశాలలో ఓటుపై అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ సుశీల్ బర్డ్ అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌వైకే ఆధ్వర్యంలో ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎన్‌వైకే కోఆర్డినేటర్ సుశీల్ బర్డ్ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేసేలా ఎన్నికల సంఘం సూచనల మేరకు కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఓటరు హెల్ప్ లైన్ యాప్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఓటరుగా నమోదు చేసుకోవడమే కాకుండా మే 13న తెలంగాణలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో యువత ఓటు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జాకీర్ హుస్సెన్, ఎన్ఎస్ఎస్ పీఓలు దయాకర్, అష్రాఫ్ అలీ, అధ్యాపకులు ప్రతాప్ సింగ్, సంతోష్, విజయ్ కుమార్, రఘునాథ్, నర్సింగరావు, రమేష్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.



ఓటరు ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎన్‌వైకే కోఆర్డినేటర్ సుశీల్ బర్డ్

బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ



బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్సీ దండే విట్టల్

నవతెలంగాణ-బెజ్జూరు

మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఎన్నికల కార్యాలయాన్ని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుతో కలిసి రిబ్బన్ కట్ చేసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా ఆత్రం సక్కును, బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారని తెలిపారు. ఎన్నికల్లో మెజార్టీతో గెలిపించాలని కోరారు. వంద రోజుల్లోనే కాంగ్రెస్ హామీలను మరిచిపోయిందన్నారు. హామీల అమలు కోసం పోరాటం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చి విస్మరించిందన్నారు. గ్రామాల్లో పర్యటించి అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ ఫలాలు గ్రామాల్లో ఇంకా నెమరు వేసుకుంటున్నారన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలోని సిర్పూర్, బెజ్జూరు మండలాల్లో పర్యటించినట్టు ఆయన తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరిన వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పుష్పలత, నాయకులు కాజా శామీయొద్దీన్, రాంప్రసాద్, శ్యాంరావు, సామల రాజన్న, నీలయ్య, చిప్పకుర్తి దేవాజీ, షణ్ముఖ చారి, విజయనిర్మళ, అమృత పాల్గొన్నారు.

పోషకాలున్న ఆహారం తీసుకోవాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శిశు స్త్రీ సంక్షేమం కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వివిధ రకాలైన పోషకాహార పదార్థాలను ఉచితంగా అందిస్తుందని, ఈ పథకం ద్వారా వచ్చే వస్తువులను పిల్లలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కాగజ్‌నగర్ డీఎల్పీఓ సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పోషణపక్షంలో భాగంగా గర్భిణీలకు, పిల్లలకు అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్త్రీ సంక్షేమం కోసం ఉచితంగా పోషకాలు కలిగిన ఆహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నారని తెలిపారు. మార్కెట్‌లో దొరికే రసాయనిక పదార్థాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. ముఖ్యంగా గర్భిణీలు పోషకాలు కలిగిన ఆహారాన్ని తప్పకుండా తీసుకోవాలని తెలిపారు. దీనిలో భాగంగా సామూహిక అక్షరభ్యాసం, గర్భిణీలకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ విజయలక్ష్మి, సూపర్‌వైజర్ పద్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న అంగన్‌వాడీలు

జీఓ నెం.94ను రద్దు చేయాలి : సీఐటీయూ



కార్మికులతో మాట్లాడుతున్న కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓదెలు

నవతెలంగాణ-రెబ్బెన

కొత్తగా తీసుకువచ్చిన జీఓ నెం.94 వెంటనే రద్దుచేసి, జీఓ నెం.22 ప్రకారం రూ.21,223 కనీస వేతనంగా చెల్లించాలని, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబాల ఓదెలు డిమాండ్ చేశారు. శుక్రవారం సీహెచ్‌పీ గోలేటి, ఓసీ ఖైరిగూడ నర్సరీల్లో జరిగిన కాంట్రాక్ట్ కార్మికుల మీటింగ్‌లో జీఓ నెం.94 రద్దు చేయాలని హైదరాబాద్ లేబర్ కమిషనర్‌కు పంపే లెటర్స్‌పై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఓదెలు మాట్లాడారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి సవరించాల్సిన కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాల జీఓలను 2012 నుంచి సవరించలేదని అన్నారు. గత పది సంవత్సరాల నుంచి కార్మికులకు వేతనాలు పెరగటం లేదని అన్నారు. వేతనాల పెరుగుదలకు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో చేసిన అనేక పోరాటాల ఫలితంగా 2021 జూన్‌లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీఓ నెంబర్ 22 తీసుకోవచ్చి, అన్‌స్కిల్డ్ కార్మికులకు కనీస వేతనం రూ.18,019గా నిర్ణయించిందని అన్నారు. ఆ తరువాత కాంటాక్టర్ల ఒత్తిడికి లొంగిపోయి జీఓను గెజిట్ చేయకుండా కార్మికులకు ద్రోహం చేసిందని అన్నారు. 2023 సెప్టెంబర్‌లో హైకోర్టు ఆర్డర్ ఇచ్చినప్పటికీ అమలు చేయలేదని అన్నారు. జీఓ నెంబరు 94 రద్దు చేయుటకు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు చేసిన సంతకాల సేకరణ కాపీలను ఈనెల 28న హైదరాబాద్ లేబర్ కమిషనర్‌కు సమర్పించనున్నట్టు తెలియజేశారు. ఈ సమావేశాలలో బాలేష్, జబ్బార్, వెంకటేష్, కొమురయ్య, పర్వతాలు, చారి, జగదీష్, శారద, చిన్నుబాయి, అనిత, లక్ష్మి పాల్గొన్నారు.

తప్పిపోయిన వ్యక్తి మృతి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఈ నెల 11న వనపర్తి జిల్లా జంగయ్యపల్లె గ్రామానికి చెందిన రంగపురం రాములు(45) అనే వ్యక్తి సిర్పూర్ మండలంలోని అచ్చెల్లి గ్రామ శివారు ప్రాంతంలో పత్తి చేనులో శవమై కనిపించినట్టు ఎస్ఐ దీకొండ రమేష్ తెలిపారు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వనపర్తి జిల్లా జంగమయ్య పల్లెకు చెందిన రంగపురం రాములు తమ కుటుంబాన్ని పోషించుకోవడానికి కొన్ని రోజుల నుండి హైదరాబాద్‌లో లారీ క్లీనర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మార్చి 2న హైదరాబాద్ నుండి ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి వెళ్లి ఐరన్ రాడ్ నింపుకొని తిరిగి హైదరాబాద్‌కు వస్తుండగా సిర్పూర్ మండలంలోని పెద్దబండ గ్రామ శివారులో ఈ నెల 7న రాత్రి లారీ చెడిపోవడంతో లారీ డ్రైవర్ జాల కృష్ణ లారీ యజమానికి ఫోన్ చేసి లారీ చెడిపోయిందని చెప్పడంతో మరమ్మత్తులు చేసుకొని రావాలని తెలిపారు. రెండు రోజులు అక్కడే ఉండగా ఈ నెల 13న మృతుడు పెద్దబండ ఊరులోకి వెళ్లి వస్తానని ఉదయం డ్రైవర్‌కు చెప్పి వెళ్లాడు. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో అతనిపై అనుమానం వచ్చి తమ కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. కుటుంబసభ్యులు మరుసటి రోజు వచ్చి సిర్పూర్ శివారు ప్రాంతంలో వెతికారు. అయిన ఆచూకీ లభించకపోవడంతో ఈ నెల 12న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అచ్చెల్లి గ్రామ శివారు ప్రాంతంలోని పత్తి చేనులో రైతులు కుళ్లిపోయిన వాసన రావడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహంపై అనుమానం రావడంతో ఈ నెల 21న కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. శుక్రవారం కుటుంబసభ్యులు సంఘటన స్థలం వద్దకు వెళ్లి చూడగా తన భర్త రాములుగా భార్య చిట్టెమ్మ గుర్తించింది. భార్య చిట్టెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మద్యం పట్టివేత

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని ఆర్లి గ్రామానికి అడే శంకర్ కిరణ దుకాణంలో నిల్వ ఉంచిన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్లి గ్రామంలోని శంకర్ కిరణ షాపులో తనిఖీ చేశారు. తనిఖీలో బీర్లు, క్వాటర్ సీసాలు లభించాయి. పట్టుకున్న మద్యం విలువ రూ.2600 ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి శంకర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. కిరాణ దుకాణాలు, బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్రేన్ ఆటో ఢీ : ఇద్దరికి గాయాలు

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలో జాతీయ రహదారిపై అప్రోచ్ రోడ్డుపై కిష్టాపూర్ నుండి రెబ్బెనక వచ్చే క్రమంలో రెబ్బెన గేటు గంగాపూర్ ఆర్చిరీ వద్ద క్రేనుని ఆటో ఢీ కొన్నాయి. ఇందులో ఆటో డ్రైవర్ కిష్టపూర్ గ్రామానికి చెందిన సునర్ కార్ మహేష్‌కు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన మహేష్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వైద్యుల సూచన మేరకు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు పేర్కొన్నారు.

ఫార్మాసిటికల్ కెమిస్ట్రీ విభాగంలో ఇప్ప వెంకటరమణకు డాక్టరేట్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూని వర్సిటీ ఫార్మాసిటికల్ కెమిస్ట్రీ విభాగంలో ఇప్ప వెంకటరమణ కి శుక్రవారం జరిగిన వైవా -ఓస్ కార్యక్రమంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ డాక్టర్ నసీం పర్యవేక్షణలో ఇప్ప వెంకటరమణ "సింథసిస్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ డ్రగ్ లోడెడ్ పాలిమెరిక్ మ్యాట్రిక్స్ ఎన్కాప్సిలేటెడ్ విత్ నానో పార్టికల్స్ ఫర్ డ్రగ్ డెలివరీ అండ్ ఫార్మాసిటికల్ అప్లికేషన్స్" అనే అంశంపై పరిశోధక గ్రంథాన్ని తెలంగాణ యూనివర్సిటీ కి సమర్పించారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ రామచందర్ ఎక్స్టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. తన పరిశోధనలో సాంప్రదాయ ఔషధం పంపే విధానం ద్వారా ఒక ఔషధం రోజుకు మూడు లేదా నాలుగు టాబ్లెట్స్ తీసుకోవడం జరుగుతుందని, దీని ద్వారా దుష్ప్రభావాలు మనిషిపై ఎక్కువగా ఉంటున్నాయి కావున ఈ దుష్ప్రభావాలను తగ్గించడానికి ఈ పరిశోధన ఎక్కువగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ విధానం ద్వారా రోజుకు మూడు లేదా నాలుగు టాబ్లెట్స్ ను ఉపయోగించుటకు బదులుగా ఒకసారి మాత్రమే టాబ్లెట్స్ తీసుకోవడం వల్ల 14 లేదా 16 గంటల వరకు క్రియాశాలకంగా పనిచేయునని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పరిశోధన ఫలితాలపై ఎక్సమినార్స్, తెలంగాణ యూనివర్సిటీ అధికారులు సంతృప్తి చెంది ఆయనకు డాక్టరేట్ అవార్డును ప్రకటించారు. తెలంగాణ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి పరిశోధక విద్యార్థికి డాక్టరేట్‌ను పొందినందుకు అభినందించారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ సిహెచ్ ఆరతి, డిపార్ట్మెంట్ హెడ్ డాక్టర్ శిరీష బోయపాటి, డాక్టర్ వాసం చంద్రశేఖర్, డాక్టర్ సత్యనారాయణ, కాంట్రాక్ట్ అధ్యాపకులు పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తపాల శాఖ మెగా మేళాకు విశేష స్పందన

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్, కోటార్మూర్‌లో శుక్రవారం తపాలా శాఖ నిర్వహించిన మెగా మేళా కార్యక్రమంలో ప్రజల విశేష స్పందన కనిపించింది. ఈ కార్యక్రమాన్ని ఉదయం ఏఎస్పీ భూమన్న మెయిల్ ఓవారిస్ చంద్రశేఖర్, దశరత్ కార్యక్రమాన్ని ప్రారంభించి టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ పాలసీలను అధిక సంఖ్యలో చేయించారు. ఒకరితో ఒకరు విశేషమైన ప్రచారం ద్వారా అధిక సంఖ్యలో వచ్చి ఇన్సూరెన్స్ పాలసీలను చేయించుకోవడం జరిగింది. కార్యక్రమంలో స్థానిక బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ పి. శ్రీనివాసరెడ్డి ఆలూర్ బీపీఎం శ్రీనివాస్, మునిపల్లి బీపీఎం జగదీశ్వర్, అంకాపూర్ బీపీఎం రవికుమార్, చేపూర్ బీపీఎం భరత్ కుమార్, అర్గుల్, బీపీఎం సృజన, గోవింద్ పేట్ బీపీఎం రవళి, మామిడిపల్లి బిపిఎం భావన, పిప్రి బీపీఎం వెంకటేష్, ఏబీపీఎంలు పడాల భూషణ్, మృదుల, కావ్య, రాము పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు విద్యనేర్పే కేంద్రాలు

● సీడీపీవో స్వర్ణలత

నవతెలంగాణ-నవీపేట్/ఏర్గట్ల

అంగన్వాడీలు అంటే కేవలం పిల్లలకు అన్నం పెట్టే కేంద్రాలు కావని విద్యను సైతం నేర్పించే కేంద్రాలను ఇన్‌చార్జి సిడిపిఓ స్వర్ణలత అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శిశువు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సిడిపిఓ స్వర్ణలత మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలు కేవలం అన్నం పెట్టే కేంద్రాలు కావని చిన్న పిల్లలకు వెయ్యి రోజుల పాటు ఆటపాటలతో విద్య నేర్పే కేంద్రాలని అన్నారు. అంతే కాకుండా మంచి పౌష్టికాహారం అందించి భవిష్యత్తుకు పునాదులు వేసే కేంద్రాలని అన్నారు. చిన్నపిల్లలకు పౌష్టికాహార లోపాలు లేకుండా చూసుకునే బాధ్యత తల్లిదండ్రులతో పాటు అంగన్వాడీలకు ఉందని అటువంటి అవగాహనను అంగన్వాడీలు కల్పించాలని డాక్టర్ అరవింద్ అన్నారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఏపీఎం భూమేశ్వర్ గౌడ్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు రదాలక్ష్మి, భాగ్యలక్ష్మి, శోభా, సరిత, వరలక్ష్మి, శ్రీ ప్రియ పాల్గొన్నారు.

ఏర్గట్ల : మండలకేంద్రంలోని రైతువేదికలో గర్భిణులకు, బాలింతలకు పోషకాహారంపై ఏసీడీపీఓ జ్ఞానేశ్వరి అవగాహన కల్పించి, పలు సలహాలు, సూచనలు అందజేశారు. గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ముర్రుపాలు, అనుబంధ పోషకాలను గురించి వివరించారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడీ టీచర్లు, పాల్గొన్నారు.